
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
10-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

ఏజెంట్ల వ్యవస్థకు చెక్..!



2



2

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

## రేపు జిల్లాస్థాయి చెస్ టోర్నీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో జిల్లాస్థాయి అండర్-9 బాలబాలికల చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఆసక్తి గల బాలబాలికలు 11వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు వినాయక్‌నగర్‌లోని అభ్యాస ది స్కూల్‌లో హాజరు కావాలని సూచించారు. 2017 జనవరి 1 లేదా ఆ తర్వాత జన్మించిన బాలబాలికలు టోర్నీలో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, సొంత చెస్ బోర్డు తీసుకుని రావాలని.. వివరాలకు 9440007004ను సంప్రదించాలని సూచించారు.

## మెడికల్ కళాశాలలో భారీగా బదిలీలు..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ మెడికల్ కళాశాలలో భారీ ఎత్తున వైద్యుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు డీఎంఈ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కళాశాలలో డాక్టర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలు జరిగాయి. కళాశాల నుంచి రిలీవ్ అయిన వైద్యుల్లో మధు ప్రొఫెసర్, బాల్‌రాజ్, ప్రతిమా రాజ్, జలగం తిరుపతి రావు, బీవీ నాగమోహన్, శివ ప్రసాద్, సయ్యదా అమ్తుల్ మోకీత్, వెంకటేశ్వర రావు, కెజె కిషోర్ కుమార్, బి శ్రీనివాస్, శ్రీనివాస్, విజయ కుమార్, రవికిరణ్ ఉన్నారు. మంచాల స్వాతి, గడ్డం రాచెల్ రవీనా పాల్, రాజశేఖర్, బీ గవాస్కర్, ఇమ్రాన్ అలీ, సరస్వతి, హరీష్‌స్వామి బదిలీ అయ్యారు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. రోహిణి, భానుప్రియ, స్మిత వదన, రాజేందర్, రాజశేఖర్, సుజయ్ కుమార్, గంగారాం, బురుగుల కాత్యాయని, హరికృష్ణ, నాగపద్మ, చంద్ర మోహన్, రోదాసి, బాబురావు, ఏ శ్రీనివాస్ బదిలీ అయిన వారిలో ఉన్నారు. నిజామాబాద్ మెడికల్ కళాశాలకు వైద్యులు ఎ.విశాల్, వెంకటేశ్వర్లు, దినేష్ కుమార్, తానాజీ జాడే, మహమ్మద్ యూసుఫ్ ఖాన్ బదిలీపై వచ్చారు. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్లు తిప్పే స్వామి నాయక్, కన్నయ్య ఉన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు వికాష్ రాథోడ్, మౌనిక, కమలాకర్ జిల్లాకు వచ్చారు.



## ప్రతి డివిజన్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి : మేయర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. 49వ డివిజన్‌లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రెయినేజీ, తాగునీటి సరఫరాను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలు, రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం ఏఎంసీ నజీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌తో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ లేకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ మెరుగైన సేవలు అందించేందుకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందన్నారు.




రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ కీలక అడుగులు వేస్తోంది. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, పేద, మధ్యతరగతి పిల్లలకు నాణ్యమైన చదువును ఉచితంగా అందించడమే లక్ష్యంగా సరికొత్త విధానాలను అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా ఒకవైపు జిల్లాలోని ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక విభాగాలను ఏర్పాటు చేస్తూ ఒకే ప్రాంగణంలో పూర్తిస్థాయి విద్యకు శ్రీకారం చుట్టగా, మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని 336 బడుల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) తరగతులను ప్రారంభించేందుకు విద్యాశాఖ అనుమతులు మంజూరు చేసింది.

– అక్షరటుడే, భీమ్‌గల్

# ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు

■ ప్రీ ప్రైమరీ తరగతులతో మహర్దశ ■ పెరగనున్న విద్యార్థుల సంఖ్య ■ ఉమ్మడి జిల్లాలో మరో 336 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులు

నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం 769 ప్రాథమిక పాఠశాలలు, 132 ప్రాథమికోన్నత పాఠశాలలు, 255 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే విద్యార్థుల సంఖ్య తగ్గడం, పాఠశాలల మధ్య దూరం, ఉపాధ్యాయుల వినియోగంలో సమన్వయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది.

దీనిలో భాగంగా జిల్లాలోని 112 ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక విభాగాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు వేర్వేరు ప్రాంగణాల్లో ఉండడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు దీనితో చెక్ పడనుంది. విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో అడుగుపెడితే పదో తరగతి వరకు నిశ్చింతగా చదువుకునే అవకాశం కలుగుతుంది.

### నాణ్యమైన విద్య

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఆటపాటలతో కూడిన నాణ్యమైన బోధనను అందించేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో 336 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తేవడానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. నిజామాబాద్ జిల్లాలో 191 పాఠశాలలు, కామారెడ్డిలో 145 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు అనుమతులు మంజూరు అయ్యాయి.

### ప్రయోజనాలు

ప్రస్తుతం ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఒకే క్యాంపస్ ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు వేర్వేరుగా ఉంటాయి. దీంతో ఆరో తరగతిలో మళ్లీ విద్యార్థులు కొత్తగా ప్రవేశం పొందాల్సి ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఒకటో తరగతి పదో తరగతి వరకు ఒకే బడిలో తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అలాగే ప్రీ ప్రైమరీతో ఎల్‌కేజీ, యూకేజీ సీట్ల కోసం ప్రైవేటు స్కూళ్లలో వేల రూపాయల డొనేషన్లు కట్టలేని పేద తల్లిదండ్రులకు ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనివ్వనుంది. కొత్త విధానంతో మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### చర్యలు ప్రారంభం

నూతన మార్పుల నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల పరిధిలోని విద్యార్థుల వివరాల సేకరణ, మౌలిక వసతుల అంచనా, గదుల లభ్యత వంటి అంశాలపై చర్యలు ప్రారంభించారు. ప్రీప్రైమరీ తరగతుల కోసం గదులను రంగురంగుల చిత్రాలతో ముస్తాబు చేయడంతో పాటు, ప్రత్యేకమైన 'బాల మిత్ర' కిట్లను, ఆట వస్తువులను సరఫరా చేయనున్నారు. ఉపాధ్యాయులకు చిన్నారులను ఆకట్టుకునేలా బోధన సాగించడానికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయుల వినియోగం సమర్థవంతంగా ఉండటంతో పాటు పాఠశాలల నిర్వహణ కూడా సులభతరం కానుందని అధికారులు పేర్కొంటున్నారు.

### నాణ్యమైన విద్య

బడుల బలోపేతానికి ప్రభుత్వ నిర్ణయాలు ఎంతో దోహదపడతాయి. 336 స్కూళ్లలో ప్రీప్రైమరీ, 112 హైస్కూళ్లలో ప్రాథమిక విభాగాల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. దీంతో ఒకే ప్రాంగణంలో 1 నుంచి 10 తరగతుల వరకు నాణ్యమైన ఉచిత విద్య అందుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్లు తగ్గి, అడ్మిషన్లు పెరుగుతాయి. కొత్త విద్యా సంవత్సరం లోపే మౌలిక వసతులు, గదుల లభ్యత, ఉపాధ్యాయుల శిక్షణ వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం.

– బాలకృష్ణ, జిల్లా సెక్టోరియల్ అధికారి

## రాజ్యసభ సీట్లను చోరీ చేసే స్థాయికి చేరిన బీజేపీ: మల్లికార్జున్



**అక్షరటుడే, కామారెడ్డి:** మొన్నటి వరకు ఓట్లను చోరీ చేసిన బీజేపీ, ఇప్పుడు ఏకంగా రాజ్యసభ సీట్లను కూడా చోరీచేసే స్థాయికి చేరుకుందని డీసీసీ జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడాన్ని ఖండించారు. దీన్ని ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన తీవ్రమైన దాడిగా అభివర్ణించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్న బీజేపీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్రలను వరుసగా కొనసాగిస్తోందన్నారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఘటన బీజేపీ రాజకీయ కుట్రలకు పరాకాష్టగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ అంశంపై బీజేపీ, ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ పార్టీ న్యాయపరమైన పోరాటం కూడా కొనసాగిస్తుందన్నారు.



## జూనియర్ కళాశాలలో మరమ్మతు పనుల పరిశీలన

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఈ పనులను కామారెడ్డి ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారంతో కలిసి పర్యవేక్షించారు. కళాశాల జరుగుతున్న మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలని అక్కడి కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేదిశగా కృషి చేయాలన్నారు. కళాశాలలో చేపడుతున్న మరమ్మతు పనుల వివరాలను ప్రిన్సిపాల్ వివరించారు. ఈ పరిశీలనలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోలు ఓటరు సవరణ సర్వేపై దృష్టి పెట్టాలి



**అక్షరటుడే, ఇందూరు:** బీఎల్ఏలు ఓటరు సవరణ సర్వేపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ బీఎల్‌వో శిక్షణ శిబిరం శిక్షకుడు మహేష్ కొనగల సూచించారు. కాంగ్రెస్ నిజామాబాద్ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో అర్బన్ నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బూత్ లెవెల్ ఏజెంట్‌గా నియమించిన ప్రతిఒక్కరూ ఈనెల 25వ తేదీ నుంచి జరిగే ప్రత్యేక ఓటరు సవరణ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నెల రోజులపాటు ఎక్కడ అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎక్కడైతే కాంగ్రెస్‌కు అనుకూలమైన ఓట్లు ఉంటాయో వాటిని తొలగించే కుట్ర చేస్తోందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మహేష్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందన్, మేయర్ ఉమారాణి, రాష్ట్ర రైతు కమిషన్ మెంబెర్ గడుగు గంగాధర్, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, నుడా ఛైర్మన్ కేశ వేణు, రాష్ట్ర మహిళా సంక్షేమ ఛైర్మన్ కవిత రెడ్డి, సీనియర్ నాయకులు రత్నాకర్, జావీద్ అక్రమ్, ఏఐసీసీ కో ఆర్డినేటర్ గన్ రాజ్, మాజీ టీపీసీసీ కార్యదర్శి సుమన్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, డీసీసీ కార్పొరేషన్ కోశాధికారి శివ ప్రసాద్, ఉపాధ్యక్షులు అంతరెడ్డి విజపాల్ రెడ్డి, సలీం, కో ఆప్షన్ మెంబెర్ నరేంద్ర సింగ్, కార్పొరేటర్లు మనోహర్, ప్రవీణ్ యాదవ్, నరేందర్, అన్వార్, ఎర్రం గంగాధర్ పాల్గొన్నారు.

## పీజీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు యూనివర్సిటీ కంట్రోలర్ ఆచార్య సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జులై నెలలో జరిగే పీజీ 2, 4 సెమిస్టర్ల రెగ్యులర్ 1, 3, 5 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 27 తేదీలోపు చెల్లించాలని రూ.100 అపరాధ రుసుముతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌లలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

## జాకోర–చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి



జాకోర–చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్



సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తూ..

**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.106 కోట్ల వ్యయంతో నిర్మించిన జాకోర-చందూర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.

### స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు

మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఎంపీ సురేష్ శెట్కార్ హెలికాప్టర్ ద్వారా సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్దకు బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ రాజేష్ చంద్ర తదితరులు స్వాగతం పలికారు. మంత్రి రాక సందర్భంగా రిజర్వాయర్ పరిసర ప్రాంతం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై మంత్రికి స్వాగతం పలికారు. మహిళలు పూలు జల్లుతూ ఆహ్వానించగా, కార్యకర్తల నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

### సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలన..

మంత్రి సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించి, ప్రాజెక్టు పురోగతి, నిర్మాణ నాణ్యత, ఎదురవుతున్న సమస్యలు, పనుల గడువు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.106 కోట్లతో నిర్మించిన జాకోర-చందూర్ ఎత్తిపోతల పథకాలను మెయిన్ స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు వివరాలను మంత్రికి వివరించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడటంతో పాటు వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## రేపు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగర పరిధిలోని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో 11న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏడీఈ-1 చంద్రశేఖర్ తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మిర్చి కాంపౌండ్ సబ్‌స్టేషన్ వరకు లైన్ పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని కాంగ్రెస్ భవన్, కవితా కాంప్లెక్స్, గంజ్, రామ్‌గోపాల్ స్ట్రీట్, దేవి రోడ్, మిర్చి కంపౌండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## యూరియా యాప్‌ను ఎత్తివేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టేందుకు తీసుకొచ్చిన యూరియా యాప్‌ను తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే అమాంతంగా ప్రజలందరిపై భారాలు వేయడం తప్ప మరొకటి లేదన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూనే రైతులకు యూరియా యాప్ తీసుకొచ్చి వారిని ఇబ్బందుల గురిచేస్తోందన్నారు. వెంటనే ఆ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ స్మార్ట్ ఫోన్లు లేక చిన్న ఫోన్లతో యాప్ డౌన్‌లోడ్ కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పద్ధతి మానుకోవాలని లేని పక్షంలో రైతులను కలుపుకొని భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ..




**అక్షరటుడే,ఆర్మూర్:** పట్టణంలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బాధితులకు బుధవారం ఫోన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఆరుగురు బాధితులు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లుగా ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇందులో రెండేళ్ల క్రితం ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లు కూడా ఉన్నారన్నారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులు రాజు, పుప్పాల రాజన్న, కోమన్‌పల్లి చంద్రశేఖర్, మచ్చ మహేష్, కాపెల్లి చిన్నయ్య, షేక్ హుస్సేన్‌లకు అందజేసినట్లు తెలిపారు.



## ప్రధాని మోదీ పాలనలో దేశం ముందడుగు..

**అక్షరటుడే, ముప్కాల్:** ప్రధాని మోదీ పాలనతో దేశం ముందడుగు వేస్తోందని మండల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రధానిగా మోదీ అత్యధిక కాలం పనిచేసినందుకు బుధవారం మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం సంతోష్, నిమ్మల శ్రీనివాస్, ముస్కు నర్సయ్య, దినేష్, నర్సయ్య, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ సిలిండర్ లీకై మంటలు.. ముగ్గురికి గాయాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** గ్యాస్ సిలిండర్ లీక్ కారణంగా ఓ ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటన కామారెడ్డిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని వినాయక్‌నగర్ కాలనీలో బుధవారం గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. ఓ ఇంట్లో వంట గ్యాస్ లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే క్రమంలో ఒకే కుటుంబానికి చెందిన మల్లవ్వ, మౌనిక, అలేఖ్య అనే ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులను అక్కడినుంచి బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను హుటాహుటిన కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సిలిండర్ పేలి ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఏజెంట్ల వ్యవస్థకు చెక్..!

**రవాణాశాఖ కార్యాలయంలో పారదర్శకంగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని.. నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీటీవో) రమేశ్ రాథోడ్ పేర్కొన్నారు. కార్యాలయంలో ఎలాంటి పనులు ఉన్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నేరుగా సంప్రందించాలని సూచించారు. కార్యాలయంలో ఏజెంట్లకు అనుమతి లేదన్నారు. జిల్లాకు కొత్తగా బదిలీపై వచ్చిన డీటీ 'అక్షరటుడే'తో ముచ్చటించారు.**

**–అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**





- ఆర్టీఏ కార్యాలయంలో నిబంధనలు పక్కాగా అమలు చేస్తాం
- దరఖాస్తుదారులు నేరుగా ఆఫీస్‌లో సంప్రదించవచ్చు
- స్కూల్, ట్రావెల్స్ బస్సులు ఫిట్‌నెస్ చేయించాల్సిందే..

జిల్లా రవాణా శాఖలో పారదర్శక సేవలందిస్తామని డీటీవో తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో కూడా వివరాలు పొందుపర్చామని వివరించారు. ఏజెంట్లను సంప్రదించి నష్టపోకూడదని వివరించారు. వారికి కార్యాలయంలో పని లేదని స్పష్టం చేశారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు సైతం 'వాహన్' వెబ్‌సైట్‌లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీఏ నిజామాబాద్ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు గతంలో వాహనదారులకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లోనూ ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. వర్షాకాలంలో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలుంటాయని.. వాహదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### స్కూల్ బస్సుల తనిఖీ

జిల్లాలో స్కూల్ బస్సులు 841, ప్రైవేట్ బస్సులు 218 ఉన్నాయని తెలిపారు. టూవీలర్లు 3.88 లక్షలు, ఆటోలు 28,959 ఉన్నాయని వివరించారు. జిల్లాలోని స్కూల్ బస్సుల్లో ఇప్పటివరకు 595 ఫిట్‌నెస్ పూర్తి చేసుకున్నాయని.. ప్రస్తుతం స్కూళ్లు ప్రారంభం కానున్నందున వాటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నామన్నారు. ప్రతి ప్రైవేట్ స్కూల్ బస్సు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ప్రమోషన్లలో సిబ్బంది వచ్చే అవకాశం

జిల్లా ఆర్టీఏలో ముగ్గురు ఎంవీఐలు, ఐదుగురు ఏఎంవీఐలు ఉండాల్సి ఉందని డీటీవో తెలిపారు. అయితే ప్రమోషన్లలో భాగంగా సిబ్బంది వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో పోలీస్‌శాఖతో సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. వాహనదారులు తమ పెండింగ్ చలాన్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలని సూచించారు.

## ప్రతిఒక్కరూ భక్తిభావనతో మెలగాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గురుస్వామి నగేష్ శర్మ అన్నారు. పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ బుధవారం మాస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నప్రసాదం వితరణ కార్యక్రమానికి ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గురుస్వామి నగేష్ శర్మ మాట్లాడుతూ.. ప్రతినెల 2వ బుధవారం అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని, ప్రతి ఒక్కరిలో భక్తి భావనతో మెలగాలని అన్నారు. అన్న ప్రసాదం కార్యక్రమానికి పూర్తి ఖర్చులు భరించిన ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పుట్టి మురళి, మీసాల రవి, కోశాధికారి గాజారెడ్డి నర్సారెడ్డి, సహాయ కోశాధికారి షేర్ ఒడ్డెన్న, పెంట జలంధర్, జనార్దన్ గౌడ్, పోల సుధాకర్, మసాల సత్యనారాయణ, బాలాజీ గంగామోహన్, జంబి హనుమాన్ ఆలయ కమిటీ ఛైర్మన్ రేగుళ్ల సత్యనారాయణ, డైరెక్టర్ నూతుల నారాయణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు సడక్ వినోద్, నర్మే నవీన్, భూపేందర్, గంగూలీ, బొప్పెన ప్రసాద్, కలిగోట గంగాధర్, నూతల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



## తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తడిపొడి చెత్తపై నగరంలోని 43వ డివిజన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ ఎర్రం గంగాధర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ వాహనాల్లో వేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులు వినియోగించుకోవాలన్నారు. అలాగే కాలనీవాసుల సమస్యలను తెలుసుకుని పరిష్కారా మార్గాలను సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ బొబ్బిలి మాధురి, బొబ్బిలి మురళి, మున్సిపల్ ఏఈ భువనేశ్వర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గురువుకు శిష్యుల ఆర్థికసాయం

**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని నలంద హైస్కూల్‌లో తమకు పాఠాలు నేర్పిన తెలుగు ఉపాధ్యాయుడు గంగాధర్‌కు ఆయన శిష్యులు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిచారు. నలంద స్కూల్‌లో 2009-10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు నలంద ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో సంస్థ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉపాధ్యాయులకు తాము అండగా నిలుస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంజు కుమార్, సుధీర్, కాసుల శ్రీకాంత్, గంగా చరణ్ గౌడ్, బస్వరాజ్, నరేష్, వినీత్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధారిలో ఈగల్ టీం ప్రత్యేకదాడులు..




**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని హైస్కూల్ పరిధిలో కిరాణా షాపుల్లో ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఈగల్ టీం దాడులు చేసింది. ఇందులో భాగంగా టీం సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్కూల్ పరిసర ప్రాంతాల్లో సిగరెట్లు, గుట్కాలు మత్తు పానీయాలు అమ్మడం చట్టరీత్యా నేరమని పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల వద్ద 150 మీటర్ల పరిధిలో ఎటువంటి మద్యం, దూమపానం వస్తువుల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీం సిబ్బందితోపాటు గాంధారి పోలీస్ స్టేషన్ సిబ్బంది బంతిలాల్, రాజు, రామ్ చందర్, సంజయ్ విజయ్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ రఘు మృతి బాధాకరం..: ఎస్పీ



**అక్షరటుడే, గాంధారి:** విధి నిర్వహణలో గుండెపోటుతో కానిస్టేబుల్ రఘు మృతి చెందడం బాధాకరమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం రఘు ఇంటికి వెళ్లిన ఎస్పీ బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రఘు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పోలీస్ శాఖ తరపున రఘు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్, బాన్సువాడ సీఐ శ్రీధర్ రావు, రూరల్ సీఐ తిరుపతయ్య, గాంధారి ఎస్సై మహేందర్ పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్‌కు విద్యార్థి జగత్ ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల పరిధిలోని పల్లికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి మల్లెల జగత్ ప్రతిభ చూపాడు. ఐదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి తన అద్భుత ప్రతిభతో ప్రతిష్ఠాత్మకమైన రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జగత్ ఉత్తమ మార్కులు సాధించి ఈ సీటును కైవసం చేసుకున్నాడు. పల్లికొండ గ్రామ చరిత్రలోనే, అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి ఒక విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడం ఇదే తొలిసారి అని పాఠశాల హెచ్‌ఎం మెతరి మల్లేష్, సర్పంచ్ మానుష అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందనడానికి విద్యార్థి ప్రతిభనే నిదర్శనమని కొనియాడారు. గ్రామానికి, పాఠశాలకు ఎనలేని కీర్తి జగత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ మేకల పూల, ఎస్సీ పాఠశాల హెచ్‌ఎం ఆరె మహేశ్వరి, ఉపాధ్యాయులు సుధాకర్, సుమలత, భవాని, హరిత, దేవిక, వలంటీర్లు సంగీత, అనూష, సుమలత, స్వర్ణలత పాల్గొన్నారు.

## ముగిసిన బడా రాంమందిర్ ఆలయ భూముల కౌలు ప్రక్రియ

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని గాజుల్‌పేట్ బడా రాంమందిర్‌కు చెందిన భూములకు సంబంధించిన కౌలు ప్రక్రియను బుధవారం కంజర జీపీలో పూర్తి చేశారు. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. ఆలయానికి చెందిన భూములు మోపాల్ మండలంలోని కంజరలో 14 ఎకరాల 13 గుంటలు ఉండగా బుధవారం ఆ భూముల్లో సాగు కోసం కౌలు ప్రక్రియ నిర్వహించారు. రామర్తి సమత రూ. 17,51,000కు పాటపడి కౌలును దక్కించుకున్నారు. కార్యక్రమంలో బడా రాంమందిర్ మఠం ఫిట్ పర్సన్ వేణు, తహశీల్దార్ సుజాత రెడ్డి, ఆయా ఆలయాల జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, ప్రశాంత్ కుమార్, రఘునాథ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ముప్కాల్:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండల కేంద్రంలో గ్రామ సభ నిర్వహించి రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్చించారు. గ్రామ పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వ్యవసాయ సంబంధిత అంశాలపై పలు తీర్మానాలు చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధుల నివారణ, డ్రెయినేజీల శుభ్రత, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా పరిశుభ్రత పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఇన్‌ఛార్జి ఎస్సై శైలేందర్, ఎంపీవో గౌస్ మొహినోద్దీన్, సర్పంచ్ కొమ్ముల సాయవ్వ, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఉప సర్పంచ్ చిన్నయ్య, వార్డు సభ్యులు, వ్యవసాయ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, విద్యాశాఖ, ఐసీడీఎస్, ఐకేపీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.